
నమస్తే తెలంగాణ
# ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



కుమారస్వామి తవ్వించిన బావి

ఎల్కతుర్తి మండలం దామెరకు చెందిన రైతు కన్నబోయిన మహేందర్ పంటలను కాపాడుకునేందుకు తవ్విస్తున్న బాయి

# సాగు నీటికి భగీరథ యత్నం

## సర్కారు నిర్వాకంతో అన్నదాతలకు కష్టాలు

**పదేండ్ల తర్వాత కొత్త బావుల తవ్వకం.. నీళ్లు లేక పాత వాటిలో పూడికతీత**

**రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల ఖర్చు.. కష్టకాలంలో రైతులకు అదనపు భారం**



దామెరలో కుమారస్వామి తవ్విస్తున్న బావి

*కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో కాల్వల్లో నీళ్లు లేక చెరువులు, కుంటలు నోళ్లు తెరుచుకున్నాయి. బోరు బావులన్నీ బోరుమంటున్నాయి. నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయి. చేతి కందే దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు భగీరథ యత్నం చేస్తున్నారు. పదేండ్ల తర్వాత కొత్త బావులను తవ్విస్తున్నారు. అడుగంటిన బావుల్లో పూడిక తీయిస్తున్నారు. రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలు ఖర్చయినా అప్పు తెచ్చి మరీ పనులు చేయిస్తూ పంటలను రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇంత చేసినా పంటలు చేతికందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.*

*– వరంగల్, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన తీరుతో అన్నదాతలు అరిగోస పడుతున్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సాగునీటి ధీమాతో పంటలు సాగు చేసిన రైతులకు ఇప్పుడు పంట చేతికి వస్తుందా అనే ఆందోళన పెరుగుతున్నది. సాగునీటి నిర్వహణలో సర్కారు నిర్లక్ష్యం ఈ ఏడాది రైతులకు భారీగా నష్టం కలిగిస్తున్నది. ఎనిమిదేండ్లుగా వచ్చినట్లుగా సాగునీరు రాకపోవడంతో పంటలను బతికించుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు లక్షలు ఖర్చు పెట్టి అప్పుల పాలవుతున్నారు. యాసంగిలో సాగు చేసిన వరి పంటకు మరో నెల వరకు సాగునీరు అవసరం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాల్వల నుంచి చెరువులు, పంటలకు నీరు రావడం లేదు. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు కొత్తగా బావులను తవ్వుతున్నారు. ఎక్కువ మంది రైతులు ఉన్న బావుల్లో పూడిక తీయిస్తున్నారు. బావుల తవ్వకం, పూడికతీతతో రైతులపై ఆర్థికంగా భారం పడుతున్నది. కొత్త బావి తవ్వేందుకు కనీసం రూ.6 లక్షల నుంచి రూ.12 లక్షల ఖర్చవుతున్నది. పూడికతీత కోసం గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. సాగునీటి సమస్యతో సొంతంగా నీటి వనరులను కల్పించుకునేందుకు రైతులు భారీగా ఖర్చు చేయాల్సి రావడంతో వారికి అప్పులు పెరుగుతున్నాయి. సర్కారు సాగు నీరు ఇవ్వకపోవడంతో ఈసారి యాసంగి పంట చేతికి వచ్చే దాకా నమ్మకం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో నీటి వనరుల కోసం అప్పులు చేయాల్సి రావడంతో రైతుల్లో ఆందోళన ఎక్కువ అవుతున్నది.

### పెట్టుబడి సాయమూ లేదు

సాగునీటి వసతి లేక ఇబ్బంది పడుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం సైతం అందడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజన్‌లో ఎకరాకు రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.10 వేలు ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సాయం రైతులకు అందడం లేదు. రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని సైతం ఇవ్వడం లేదు. ఇప్పటి వరకు 3 ఎకరాల వరకు ఉన్న రైతులకు సైతం పూర్తిగా పెట్టుబడి సాయం అందలేదు. సర్కారు నిర్లక్ష్యంతో సాగునీటి వసతి కోసం రైతులు భారీగా ఖర్చు పెడుతున్న సమయంలోనూ వారికి పెట్టుబడి సాయం అందడం లేదు. సాగునీరు ఇవ్వక, పెట్టుబడి సాయం అందించక రాష్ట్ర ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేస్తున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### నీళ్లు రాక గోస..

రాష్ట్ర ఏర్పాటు తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న చర్యలతో సాగునీటి వసతులు పెరిగాయి. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంతో శ్రీరాంసాగర్, దేవాదుల ఆయకట్టు స్థిరీకరణ కోసం అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయించారు. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు ఏడేండ్లు నిండుగా ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి వెంట దాదాపు 150 కిలోమీటర్ల వరకు నీటి నిల్వతో అన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ప్రతి ఊరిలోనూ సరిపడా భూగర్భ జలాలు ఉండడం, ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల నుంచి చెరువులకు, అక్కడి నుంచి పంటలకు నీళ్లు వచ్చేవి. వానకాలం పంటలకు నీటి వసతిలో ఎక్కడా ఇబ్బంది లేకుండా సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. దేవాదుల ప్రాజెక్టు నుంచి పంపింగ్ జరుగుతున్నా నీటి సరఫరా నిర్వహణలో విఫలమైంది. ఎస్సారెస్పీ ఆయకట్టు విషయంలోనూ ఇదే జరిగింది. దేవాదుల ప్రాజెక్టు పరిధిలో ఐదేండ్లుగా రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు వచ్చే గ్రామాలకు ఇప్పుడు రావడం లేదు. సాగునీటి సరఫరా నిర్వహణలో ప్రభుత్వ లోపం కారణంగా అంతటా భూగర్భ జలాలు వేగంగా తగ్గాయి. నెల రోజుల్లోనే సగటున మీటరు లోపలికి వెళ్లాయి. దీంతో ఇప్పటికే ఉన్న బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే సాగునీరు సరఫరా చేస్తుందని రైతులు ఈ యాసంగిలోనూ పంటలు వేశారు. నీళ్లు లేక పంటలు ఎండి పోయే పరిస్థితి వచ్చింది. సాగునీటి సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై రైతులు క్రమంగా నమ్మకం కోల్పోతున్నారు. ఒక్కొక్కరుగా సొంతంగా నీటి వనరులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇన్నేండ్లు పంటలతో వచ్చిన పైసలను ఇప్పుడు కొత్త బావుల కోసం, పాత బావుల పూడికతీత కోసం ఖర్చు చేస్తున్నారు.



### మూడెకరాల కోసం బాయి తవ్విన

మాకు మూడు ఎకరాల పంట భూమి ఉన్నది. ఇన్నేండ్లు నీళ్లు మంచిగ ఉండె. పత్తి పంట వేసేది. దేవాదుల నీళ్లు అప్పటి లెక్క వస్తలేవు. రూ.7లక్షలు అప్పు చేసి బాయి తీయించిన. పంట పండి అప్పులు తీరుతయో లేదో చూడాలె.

– గొర్రె కుమారస్వామి, దామెర, ఎల్కతుర్తి

### పదేళ్ల తర్వాత మళ్లీ వచ్చినం

పదేండ్ల కింది వరకు కరీంనగర్, వరంగల్ జిల్లాలకు బావులు తవ్వేందుకు వచ్చేవాళ్లం. వందల బావులు తవ్వినం. తెలంగాణ వచ్చినంక ప్రాజెక్టులతోని నీళ్లు వచ్చి మాకు పని లేకుండా పోయింది. ఇప్పుడు మళ్ల మాకు పాత రోజులు వచ్చాయి. రైతుల బావుల్లో పూడికలు తీసుడు, కొత్త బావులు తవ్వుడు చేస్తున్నం.

– ఇరుగండ్ల రేణుక, మిర్యాలగూడ





గిరిజనులు సేకరించిన ఇప్పపువ్వు

# అడవి సిగలో..

## ఇప్ప పూల సుగంధం!

**ఏజెన్సీలో మొదలైన సేకరణ**

**గిరిజనులకు వేసవిలో చక్కని ఉపాధి**


**జీసీసీ ద్వారా కొనుగోళ్లు**

**గిట్టుబాటు ధర లేక తగ్గుతున్న ఆసక్తి**

వాజేడు/మహదేవపూర్, ఏప్రిల్ 4 : అడవి బిడ్డలకు ఉపాధినిచ్చే ఇప్ప పూల సీజన్ మొదలైంది. దీని కోసమే ఎదురుచూస్తున్న గిరిజన, గిరిజనేతర కుటుంబాలు అడవిబాట పడుతున్నాయి. వేకువ జామునే సమీప అటవీ క్షేత్రంలోకి వెళ్లి చెట్టు నుంచి రాలిన ఇప్పపూలను బుట్టల్లో సేకరిస్తున్నాయి. ప్రత్యేక పద్ధతిలో వారం రోజుల పాటు ఎండబెట్టిన తర్వాత గిరిజన సహకార సంస్థ(జీసీసీ)లో విక్రయిస్తాయి. అటవీ ఉత్పత్తుల్లో అక్టోబర్–ఫిబ్రవరి మాసంలో చిల్ల గింజలు, తాండి కాయలు, విషముష్టి కాయలు, సెప్టెంబర్–జూన్ తవుసు బంక, మార్చి–మే ఇప్ప పువ్వు, జూన్–జూలైలో ఇప్పపరక సేకరణతో గిరిజనులకు ఉపాధి లభిస్తుంది.

### సీజన్ ప్రారంభం

వరి, మక్కజొన్న, మిర్చి పంటల్లాగే వేసవికాలంలో ఇప్ప చెట్లు మార్చి, ఏప్రిల్ నెలల్లో పూత, కాతలతో నిండి ఉంటాయి. దీనినే ఇప్ప సీజన్‌గా పిలుస్తారు. ఇది అడవి బిడ్డలకు రెండో పంటగా చెప్పవచ్చు. సహజ సిద్ధంగా దొరికే ఇప్ప పూలు పలు విధాలుగా ఉపయోగపడతాయి. ఈ సమయంలలో గిరిజనులు, గిరిజనేతరులు పూల సేకరణలోనే నిమగ్నమవుతారు. ఉదయం 10 గంటల వరకు పూలు ఏరి, తిరిగి గూడేలు, గ్రామాలకు చేరుకొని ఎండబెడతారు.





ఇప్ప పూలు సేకరిస్తున్న గిరిజనులు

### పలు రకాలుగా వినియోగం

వర్షాకాలంలో ఇప్ప పూలను చిక్కుడు గింజలు, అలసందలతో కలిపి ఉడికించి అంబలి కాస్తారు. ఇప్ప పువ్వు అన్నం వండుతారు. మరికొందరు ఉండలుగా చేసి అల్పాహారంగా స్వీకరిస్తారు. అలాగే వీటిని మందుల తయారీలోనూ వాడతారు. ఈ పూల నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం తదితర వ్యాధులకు ఉపయోగిస్తారు. ఇప్ప బద్ధలతో సబ్బులు, ఎరువులు తయారు చేయడంతో పాటు వీటి నుంచి తీసిన నూనెను వంటలతో పాటు దీపారాధనకు వినియోగిస్తారు. మరికొందరు ఇప్ప సారా తయారు చేసుకొని సేవిస్తుంటారు.

### దక్కని గిట్టుబాటు ధర

అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో ప్రస్తుతం వీటి సేకరణపై గిరిజనుల ఆసక్తి యేటా తగ్గుతూ వస్తున్నది. ప్రస్తుతం ఇప్పపువ్వును జీసీసీ ద్వారా కిలో రూ.30కు కొనుగోలు చేస్తున్నారు. అయితే బయట మార్కెట్‌లో కిలోకు రూ.50 చెల్లిస్తున్నారని, తమకు గిట్టుబాటు ధర పెంచాలని గిరిజనులు జీసీసీని అభ్యర్థిస్తున్నారు. ఈ విషయమై వెంకటాపురం(నూగూరు), మహదేవపూర్ జీసీసీ మేనేజర్లు దేవ్, హరిలాల్ మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులపై గిరిజనులు అవగాహన కల్పిస్తున్నామని, ఈ ఏడాది కూడా ఇప్ప పువ్వు సేకరణకు టార్గెట్ నిర్దేశించినట్లు తెలిపారు. గిట్టుబాటు ధర కోసం ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.





## మార్కెట్‌కు వరుస సెలవులు

కాశీబుగ్గ, ఏప్రిల్ 4 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు ఇస్తున్నట్లు కార్యదర్శి క్యారం సంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 5న శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, 6,7న శని, ఆదివారాలు వారాంతపు సెలవు, 8న అమావాస్య, 9న ఉగాది పండుగ సందర్భంగా సెలవులు ఇస్తున్నట్లు వెల్లడించారు. 10న మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

**మరో నాలుగు రోజులు సెలవులు**

ఈ నెల 11,12, రంజాన్ పండుగ, 13, 14న శని, ఆదివారాలు వారాంతపు బంద్ అని మార్కెట్ అధికారులు తెలిపారు. మొత్తం 9రోజులు మార్కెట్‌కు సెలవులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

# నిట్‌లో నేటి నుంచి స్ప్రింగ్ స్ప్రీ

**మూడు రోజులు 35 ఈవెంట్లు..**

**పాల్గొననున్న 10 వేల మంది విద్యార్థులు**

**వేడుకలను ప్రారంభించనున్న డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి**

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4 : కల్చరల్ ఫెస్ట్ స్ప్రింగ్‌స్ప్రీ-2024 వసంతోత్సవానికి నిట్ రెడీ అయింది. ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ఈవెంట్‌ను ప్రారంభించనున్నారు. మూడు రోజుల్లో దాదాపు 35 ఈవెంట్‌లు ప్లాన్ చేసినట్లు నిట్ డైరెక్టర్ తెలిపారు. 1978 నుంచి నిర్వహిస్తున్న ఈ ఉత్సవం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటని, ఈ సంవత్సరం రెండు ప్రో షోలు ఉంటాయని పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య మాట్లాడుతూ.. ఈవెంట్‌లో 10 వేల మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

**నేటి ఈవెంట్లు..**

సాయంత్రం 4 గంటల తర్వాత అన్‌సాల్వ్‌డ్, నుక్కడ్ నాటక్, నిట్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నాట్యకళ, ఫుడ్ హంట్

ప్రో షోలు : గాయకుడు హరిచరణ్, ప్రముఖ సౌత్ ఇండియన్ రాక్ బ్యాండ్ చౌరస్తా ప్రదర్శన

**6న జరిగే ఈవెంట్లు..**

సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్ క్విజ్, హంగర్ గేమ్స్, ఫొటో పజిల్,

ప్రో షోలు: గాయకుడు నకాశ్ అజీజ్, ఇండియన్ రాక్ బ్యాండ్, లోహర్ ది బ్లాక్‌స్మిత్ ప్రదర్శన

7న జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలే





# నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

**నయీంనగర్ పెద్ద మోరీ కూల్చివేత పనులు**

**మూడు నెలల పాటు రాకపోకలు బంద్**

**సీపీ అంబర్ కిశోర్ ఝా**



హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 4: నయీంనగర్ పెద్దమోరీ కూల్చివేత పనులు జరుగనున్నందున శుక్రవారం నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా తెలిపారు. రూ.8.5 కోట్లతో కొత్త బ్రిడ్జి నిర్మాణం చేస్తుండడంతో 3 నెలలపాటు నయీంనగర్ రోడ్డుపై రాకపోకలు బంద్ చేస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించి, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించి సహకరించాలని సీపీ నగర ప్రజలను కోరారు. కరీంనగర్ నుంచి ఖమ్మం, నర్సంపేట, వరంగల్ వైపునకు వెళ్లాల్సిన భారీ వాహనాలు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మ గడ్డ, ఆటోనగర్ మీదుగా వెళ్లాలి. కరీంనగర్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మ గడ్డ, ములుగు రోడ్డు, అమృత జంక్షన్, హనుమకొండ చౌరస్తా మీదుగా బస్టాండ్ చేరుకోవాలి. ఖమ్మం నుంచి కరీంనగర్ వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు ఉర్సుగుట్ట, కడిపికొండ, మడికొండ, ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలి. వరంగల్, నర్సంపేట వైపు నుంచి కరీంనగర్ వైపునకు వెళ్లాల్సిన భారీ వాహనాలు ఎంజీఎం, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మ గడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాలి. హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు హనుమకొండ చౌరస్తా, అమృత, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మ గడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.

# ఆర్డీవో కార్యాలయం ఆస్తులు జప్తు

**టెక్స్‌టైల్ పార్కు కోసం ఇచ్చిన భూములకు పరిహారం చెల్లింపులో జాప్యానికే..**



వరంగల్ ఆర్డీవో కార్యాలయం

ఖిలావరంగల్, ఏప్రిల్ 4: టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తూ కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదని వరంగల్ ఆర్డీవో కార్యాలయంలోని ఆస్తులను జప్తు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట గ్రామానికి చెందిన సముద్రాల స్వామి, అతని కూతురు వెన్నెలకు సంబంధించిన 20 ఎకరాల భూమిని ప్రభుత్వ టెక్స్‌టైల్ పార్కు కోసం తీసుకున్నారు. అయితే ఎకరానికి రూ.10 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పి భూమిలో రోడ్లు వేశారు. నష్ట పరిహారం తక్కువగా వస్తుందని పలు మార్లు జిల్లా ఉన్నతాధికారులను ఆశ్రయిస్తే అప్పీల్‌కు వెళ్లమన్నారు. దీంతో బాధితులు హైదరాబాద్‌లోని ల్యాండ్ అక్విజేషన్ అథారిటీని ఆశ్రయించడంతో ప్రభుత్వం, ఆర్డీవో వరంగల్ బాధితులకు రూ.2.40 కోట్లు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. డబ్బులు చెల్లించకుండా ఆలస్యం చేస్తుండడంతో బాధితులు ఎగ్జిక్యూటివ్ పిటీషన్ వేశారు. అయినప్పటికీ డబ్బులు చెల్లించకుండా ఆలస్యం చేస్తూ ఉత్తర్వులను అమలు చేయలేదని కోర్టు భావించి వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఆస్తులు జప్తు చేయాలని ఆదేశించింది. దీంతో గురువారం కోర్టు నుంచి వచ్చిన అధికారులు, సిబ్బంది ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని కోర్టు ఆర్డర్‌ను అంటించారు. అనంతరం కంప్యూటర్లు, ప్రింటర్లు, ఏసీలు, కూలర్లు, ఆర్డీవో వాహనంతోపాటు ఇతరత్రా వస్తువులను జప్తు చేశారు.



గొత్తికోయలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు నడిచి వెళ్తున్న వైద్య సిబ్బంది

# మండుటెండలో కాలినడకన

**14 కిలోమీటర్లు నడిచి వైద్యసేవలందించిన వైద్యులు**

గోవిందరావుపేట, ఏప్రిల్ 4: మండలంలోని చల్వాయి గ్రామ శివారులోని జారుడు బండ అటవీ సమీపంలో నివసిస్తున్న గొత్తికోయలకు వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది 14 కిలోమీటర్ల మేర అడవుల్లో నడుస్తూ వాగును దాటి మండుటెండలో వెళ్లారు. జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ఎంసీహెచ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ పవణ్‌కుమార్ ఆదేశాల మేరకు గొత్తికోయగూడేనికి వెళ్లినట్లు స్థానిక వైద్యాధికారి పోరిక చంద్రకాంత్ తెలిపారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదివాసీలకు సూచనలు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జంపయ్య, శ్రీనివాస్, ఏఎన్ఎం రాధిక, ఆశ వర్కర్లు, శ్రీలత, భారతి, వనిత, సరోజ, స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గొత్తికోయలతో వైద్య సిబ్బంది